

పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను పి.జి. కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరవచ్చని ఏ.పి.పి.జి. సెట్ 2025లో అర్హత సాధించిన విద్యార్థులు, టెస్ట్ రాయని వాళ్లుస్పాట్ అడ్మిషన్ల ద్వారా అడ్మిషన్ పొందవచ్చని డిఓఎ డైరెక్టర్ ఆచార్య వి. రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎ, ఎం.కామ్ ఎం.యస్సీ కోర్సుల్లో చేరదలచిన ఆసక్తి కలిగిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు. అడ్మిషన్ ప్రక్రియకు విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ టి.సి, ప్రొవిజనల్, క్యాస్ట్, రెసిడెన్స్ సర్టిఫికెట్, సంబంధిత కోర్స్ ఫీజుతో హాజరుకావాలని తెలిపారు. ఈ స్పాట్ అడ్మిషన్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యం ఉండదు, మొదట ర్యాంకర్స్కు, తర్వాత నాన్ ర్యాంకర్స్కు ప్రాధాన్యత ఇవ్వబడును. అడ్మిషన్ల కొరకు 8న కామర్స్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, 9న సైన్సెస్ (ఎం.యస్సీ) విద్యార్థులు, 10నన ఆర్ట్స్ (ఎం.ఎ) విద్యార్థులు డి.ఓ.ఏ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

18 ఏళ్ల 'మా సేవ' అంతేనా..!

రాజకీయ చదరంగంలో బలయ్యాం. 2003లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మీ సేవ కేంద్రాలను చంద్రబాబునాయుడు ప్రారంభించారు. 2020లో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మమ్మల్ని కూకటివేళ్లతో పెకలిస్తూ మా బతుకుపై కొట్టారు. ఉన్నపళంగా మమ్మల్ని ఉద్యోగాల్లోంచి తొలగించేశారు. 607 మంది ఉద్యోగులం దిక్కుతోచక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ వచ్చాం. యువగళం పాదయాత్రలో చంద్రబాబునాయుడు మళ్లీ మా బతుకుల్లో ఆశలు నింపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 ఏళ్లయ్యింది. పట్టించుకోలేదు. అందుకే తిరుపతి గరుడ సర్కిల్ నుంచి అమరావతి వరకూ పునర్జీవన సైకిల్‌యాత్ర చేపట్టాం.

రూ.4వేల జీతంతో ప్రారంభించారు

2003లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీసేవ ఉద్యోగులకు ఇఎస్ఐ, ఇపిఎఫ్ పట్టుకుని 3500-4000 జీతం పట్టుకుని మమ్మల్ని నియమించారు. అప్పట్లో సిఎమ్మెస్ కంపెనీ జీతాలు ఇచ్చేది. 2005లో శ్రీవెన్ కంపెనీ 6వేల జీతం ఇచ్చింది. తర్వాత 2011లో కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో 9500 జీతంపెంచుతూ నిర్ణయించారు. రోజుకు రెండు గంటల పాటు ఎనిమిది గంటలు పనిచేసేవాళ్లం. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత చాలా మందికి కుల, నివాస, జనన మరణ సర్టిఫికెట్లు తీసుకోవాలంటే నెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. వైసిపి హయాంలో అప్పటి ఐటి మంత్రిగా ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి మీ సేవ ఉద్యోగులను తీసుకోడానికి ప్రయత్నాలు చేశారు. అయితే అకాల మరణంతో వాయిదా పడింది.

19 నెలలుగా 'మీసేవ' కార్మికుల ఆవేదన
నేటినుంచి పునర్జీవన సైకిల్ యాత్ర
కూటమి హామీలను తక్షణం అమలు చేయాలి
16-19 తేదీల్లో విజయవాడలో రిలేదీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

2003లో అప్పట్లోనూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రజలకు మెరుగైన సేవలు, ఈ గవర్నెన్స్ పాలన అందించేందుకు మీసేవను ప్రారంభించారు...18 ఏళ్ల పాటు 170 అర్బన్ 'ఇ' మీ సేవ కేంద్రాలలో 467 సేవలు అందించారు. ప్రభుత్వానికి కమీషన్ రూపంలో ఏడాదికి 145 కోట్లు ఆదాయం వచ్చేది. ప్రభుత్వ శాఖలకు ఏడాదికి 4వేల కోట్ల ఆదాయం వచ్చేది. యూజర్ ఛార్జీల రూపంలో మరో 30 కోట్లు సమకూర్చాం. మొత్తం 607 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా ఉండేవాళ్లం. 2011లో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మీ సేవ పేరు మార్చి ఈసేవగా మార్చారు. రెవెన్యూ, విద్యుత్, ఇంటిపన్నులు, భూగర్భడ్రైనేజీ పనులతో పాటు, జనన మరణ సర్టిఫికెట్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, భూరికార్డులు, ఆధార్‌కార్డులతో పాటు రేషన్‌కార్డులూ ఇచ్చేవాళ్లం. వైసిపి హయాంలో 2020లో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చేందుకు ఈ సేవ ఉద్యోగులను తొలగించారు. రాష్ట్రవ్యాప్తంగా 607 మంది బలయ్యాం. తొలగించవద్దని, ఇతర శాఖలకైనా బదిలీ చేయాలని వేడుకొన్నా జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదు. గత్యంతరం లేక కూలి పనులు సైతం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. అయితే కూటమి ప్రభుత్వం యువగళం పాదయాత్రలో మా సేవలను గుర్తిస్తామని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చి 19 నెలలైనా మా గురించి పట్టించుకోలేదు. అందుకే పోరుబాట పట్టాం' అంటూ తొలగించబడిన 607 మంది ఉద్యోగులం ఉద్యమబాట పట్టాం. సోమవారం నుంచి పునర్జీవన సైకిల్ యాత్ర చేపట్టాం. ఈనెల 16-19 తేదీల్లో విజయవాడలో రిలేదీక్షలు చేయనున్నాం.

ఉద్యోగ భద్రత కల్పించండి : రామకృష్ణారెడ్డి, ఎపి ఈ(మీ)సేవ కాంట్రాక్టుఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

మీ సేవ ఉద్యోగులను ఆదుకుంటామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలి. మొత్తం 607మంది మీసేవ ఉద్యోగులు ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారు. 19 నెలలుగా కూటమి ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించలేదు. గతంలో మేము చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలి.

తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

మీసేవ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి. వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామని నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని పదేపదే చెబుతున్నప్పటికీ బాగానే ఉందని, అయితే మీ సేవ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 607 మందిని గత ప్రభుత్వంలో తొలగించారన్నారురర. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. వారు చేసే పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుంది.

పార్టీలకతీతంగా గోకులం షెడ్లు

యూరియా కొరత లేదు
అర్హులందరికీ సంక్షేమ పథకాలు
జెడ్‌పి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందజేయడానికి ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉండే విధంగా కషి చేస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. పార్టీలకు అతీతంగా గోకులం షెడ్లు నిర్మిస్తామని, యూరియా కొరత లేదని చెప్పారు. శనివారం స్థానిక జెడ్పి కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు, తిరుపతి డిఆర్‌ఓ, నరసింహులు, జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అర్హత కలిగిన పాడి రైతులకు గోకుల షెడ్లు నిర్మాణం పార్టీలకు అతీతంగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కుప్పం నియోజకవర్గంలో పలు అభివ ద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, సంబంధిత పి ఆర్ ఇంజనీర్లు, ఆర్ అండ్ బి ఇంజనీర్, హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా పల్లె పండుగ సందర్భంగా పాడి పరిశ్రమ సంబంధించిన రైతులకు పశువుల గోకుల షెడ్ల నిర్మాణం పనులు 2342 పనులు మంజూరు చేయడం జరిగిందని, 620 నిర్మాణం పనులు పూర్తి చేయడం జరిగిందని వివిధ దశలో 1182 నిర్మాణం పనులు జరుగుతున్నాయని వివరించారు. అర్హత కలిగిన పాడి రైతుకు మీ మండలాలలో ఎవరైనా ఉంటే దరఖాస్తులు సమర్పించుకోవచ్చునని పేర్కొన్నారు. ఉద్యానశాఖ ద్వారా పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి 40శాతం రాయితీ అందజేస్తున్నామన్నారు. కొత్త పింఛన్లు ప్రభుత్వ అనుమతితో ఇస్తామన్నారు. ఇల్లులేని నిరుపేదలందరికీ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. అందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 72,763 ఇళ్లను మంజూరు చేశామని, వీటి విలువ 1349.88 కోట్లు మంజూరు చేశారని, ఇప్పటివరకు 53,382 ఇల్లు పూర్తయ్యిందని, 69,376 ఇల్లు వివిధ దశలో నిర్మాణం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరూ స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎ క్కు వ జ్వరం, తీవ్ర తలనొప్పి, శరీర బలహీనత, వాంతులు, వంటి లక్షణాలతో పాటు కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ కనిపించవచ్చన్నారు. దీనిపై విస్త తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సభ ద ష్టికి తీసుకువచ్చారు. జడ్పీ సీఈఓ మాట్లాడుతూ నగిరి, కార్వేటినగరం, పాలసముద్రం, జీడి నెల్లూరు అభివ ద్ధి పనులకు నిధులు పుష్కలంగా ఉన్నాయని, సుమారు మండలంలో ఒక కోటి రూపాయలు నిధులు ఉన్నాయని వాటిని అభివ ద్ధి పనులకు త్వరలో క్షేత్రస్థాయిలో తన పర్యటనలో పనులకు ఆమోదం తెలిపామన్నారు. దాదాపు 255 మంది సభ్యులు హాజరయ్యారు.

22న మామిడి రైతుల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి)

మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తామని చెప్పిన మద్దతు ధరను గుజ్జు పరిశ్రమలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 22న చలో కలెక్టరేట్‌కు రైతుసంఘాలు పిలుపునిచ్చాయి. చిత్తూరు ఎస్‌టియు కార్యాలయంలో మామిడి రైతుల సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి హాజరయ్యారు. నాయకులు మునీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. రైతుసంఘం ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ మామిడి రైతులకు బకాయి పడిన రూ.8ని గుజ్జు పరిశ్రమలు వెంటనే ఇవ్వాలని, ఆరు నెలలుగా ఇవ్వకపోవడం వల్ల ఆలస్య రుసుం సైతం చెల్లించాలన్నారు. బకాయి రాకపోవడంతో ఇతర పంటలకు పెట్టుబడులు పెట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. రైతులకు ఇవ్వాల్సిన బకాయిల కోసం ఈనెల 22న సోమవారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలోనే గత బకాయిలు, రానున్న సీజన్‌లో మామిడిని ఎలా అమ్ముకోవాలనే అంశంపై సమగ్రంగా చర్చించుకుందామన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె.సురేంద్రన్, మునిరత్నంనాయుడు, ఉమాపతినాయుడు, మోహన్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సేవలు అజరామరం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలు అజరామరం' అని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎంఎల్ఎ ఆదిమూలం, మాజీ మంత్రి పరసారత్నం, కమిషనర్ ఎన్.మౌర్య ఉద్ఘాటించారు. బస్టాండ్ ఆవరణలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అధికారులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్ పాల్గొన్నారు.

- సూళ్లూరుపేటలో ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

శెట్టిపల్లి స్థలం చదునుకు టెండర్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, శెట్టిపల్లి టౌన్‌షిప్ ఏర్పాటుకు స్థలాన్ని చదునుచేసేందుకు టెండర్ పిలవన్నుట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎన్.మౌర్య చెప్పారు. అలాగే పెరుమాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలకు గ్యాస్ ఆధారిత స్మశాన వాటిక, కర్మక్రియల షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఉప్పరపల్లి నుంచి మహిళా విశ్వ విద్యాలయం వరకూ నాలుగు లైన్ల రోడ్డుకు ఆమోదం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్పకశం వద్ద తుడా పరిధిలో ఏర్పాటు చేసిన పద్మావతినగర్ లేఔట్‌లో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. బోర్డు సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఇఇ రవీంద్ర, సిపిఒ దేవికుమారి పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు శ్రీరామ విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. తమ కళాశాలలో ఇన్‌ఫోసిస్‌కు ఆరుగురు ఎంపికయ్యారన్నారు.కోర్సు పూర్తయ్యే లోపు ప్రాంగణ ఎంపికల ద్వారా ఉపాధి అవకాశాలు విద్యార్థులకు కల్పించడమే లక్ష్యంగా కషి చేస్తున్నామన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

బర్డ్ ట్రస్ట్‌కు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబురావు అనుముల, శశాంక్ అనుముల అనే భక్తులు శనివారం బర్డ్ ట్రస్ట్ కు రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు దాతలు హైదరాబాద్ లోని టిటిడి ఛైర్మన్ కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడుకు చెక్ అందించారు. టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

అమరాలో తుంటి ఆపరేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట

అమర ఆస్పత్రిలో తుంటి పరిరక్షణ సిఎంఇ ప్రోగ్రాం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. తుంటి సంబంధిత సమస్యల ముందస్తు గుర్తింపు, స్పోర్ట్స్ ఇంజ్యూరీస్, కార్టిలేజ్ ప్రిజర్వేషన్, ఆధునిక శస్త్ర చికిత్సా పద్ధతులు అంశాలపై ప్రముఖ నిపుణులు అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఆర్థోపెడిక్ నిపుణులు పాల్గొన్నారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని మాట్లాడుతూ దేశంలో తుంటి సంబంధిత వ్యాధులు, యువతలో కనిపిస్తున్న త్వరిత తుంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా వైద్య పరిజ్ఞానం అవసరం అన్నారు.

పాట్నాలో టిటిడి ఆలయ నిర్మాణానికి అంగీకారం

ప్రజాశక్తి - తిరుమల

పాట్నాలో టిటిడి ఆలయం నిర్మాణానికి బీహార్ ప్రభుత్వం అంగీకరించి 10.11 ఎకరాల భూమిని కేటాయించడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్యులు నారా లోకేష్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అభినందించారు. 10.11 ఎకరాల స్థలాన్ని పాట్నాలోని మొకామాఖాన్ ప్రాంతంలో కేటాయించినట్లు ప్రధాన కార్యదర్శి ప్రతయ అమృత్ తెలిపారు. ఆ భూమిని 99 సంవత్సరాల పాటు రూ.1 టోకెన్ లీజ్ రెంట్‌తో ఇవ్వాలని బీహార్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

బాలల సైన్స్ ఫెస్టివల్‌లో ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ

దేశ పురోగతికి విద్యార్థులు పరిశోధనలు చేయాలి
ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశం అన్ని రంగాలలో ప్రపంచంతో పోటీ పడుతూ ఉన్నవేళ విద్యార్థులు దేశ పురోగతికి దోహదపడే నూతన పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని తిరుపతి ఇండియన్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్. సత్యనారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్ లో తిరుపతి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాలల సైన్స్ ఫెస్టివల్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐఐటి డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్య నుండే సజనాత్మకత, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని అలవర్చుకోవాలన్నారు. పరిశోధనా రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రథమ భాగం ఉందని, దేశం పురోగమనం వైపు వెళుతున్న సమయంలో నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ నూతన అన్వేషణ ఆలోచనలను విద్యార్థులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, రీజనల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో: విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ.

ఎస్ఎఫ్ఐ సాంస్కృతిక కార్యక్రమాలు సక్సెస్

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు ఈనెల 12-14 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో శనివారం సంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ముఖేష్, బాలాజీ చేతుల మీదుగా చెస్ పోటీలు జరిగాయి. డ్రాయింగ్‌ను అర్చన ఆధ్వర్యంలో నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించారు. హెల్ప్ టు అదర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ మణికంఠ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, శివ తేజ పాల్గొన్నారు.సంస్కృతిక కార్యక్రమాల ద్వారా సామాజిక చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని మహాసభల నేపథ్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

కూలీలపై దిత్వా దెబ్బ

పది రోజులుగా ఉపాధి నిల్
పూట గడవక పడరాని పాట్లు
పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అసలే మోడీ నల్ల చట్టాలతో కునారిల్లుతున్న కార్మిక వ్యవస్థపై పక తి పగబట్టినట్లుంది. దిత్వా తుఫాను కారణంగా పది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా రోజువారీ కూలీలకు ఉపాధి కరువైంది. ముఖ్యంగా భవన నిర్మాణరంగం, ఇటుక బట్టీలు, క్వారీలు, క్రషర్లలో పనిచేసే కార్మికులకు పని లేక.. కూలీ రాక కుటుంబాలను పోషించుకోవడం కడు కష్టంగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని రోజువారీ కూలీలకు పది రోజులుగా పనుల్లేక ఖాళీ కడుపుతో అల్లాడిపోతున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పూట గడవక పడరాని పాట్లు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మందికి పైగా రోజువారీ కూలీలు భవన నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, క్వారీలు, ఇతరత్రా చోట్ల పనిచేస్తూ పొట్ట పోసుకుంటున్నారు. అయితే గత నెల 29వ తేదీ నుంచి తిరుపతి జిల్లా వ్యాప్తంగా ద్విత్వ తుఫాను ప్రభావంతో ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురవడంతో ఉపాధిని కోల్పోయారు. మరీ ముఖ్యంగా భవన నిర్మాణ రంగంతో పాటు దాని అనుబంధంగా సిమెంట్, స్టీలు, ఆటో రంగాల్లో పని చేసే సుమారు 50

వేలకు పైగా కార్మికులపై సైతం దిత్వా ప్రభావం పడింది. ఫలితంగా పని కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఈ నెలలో మరో తుపాను వచ్చే అవకాశలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో రోజూ వారీ కూలీల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే దిత్వా నుంచి కోలుకుంటున్న వలస కూలీలపై మరో తుపాను ప్రభావం చూపితే ఇక అంతే సంగతులు.

తుపాను సాయమేది!

ఈ ఏడాది వర్షాకాలానికి ముందే జిల్లాలో వర్షాలు మొదలైపోయాయి. అక్టోబర్, నవంబర్ మాసాల్లో వరుస తుపానులు ఊపిరితీసుకోకుండా చేశాయి. తాజాగా దిత్వా. అయితే వర్షాల కారణంగా రోజువారీ కూలీలను ఆదుకోవడంలో కూటమి సర్కారుకు చిత్తశుద్ధి కరువైంది. పనులు కోల్పోయినన్ని రోజులు భృక్తి, భతి కల్పించాలన్న కనీస ఆలోచన చేయలేదు. ఇప్పటికైనా ఆ దిశగా ఆదుకోవాలని రోజువారి కూలీలు కోరుతున్నారు.

పది రోజులుగా పనిలేదు: శ్రీధర్, ఆటో కార్మికుడు

తుపాను వల్ల పది రోజులుగా ఆటో తిరగలేదు. ఇంటి నిర్మాణాల వద్దకు సిమెంట్ తీసుకెళ్లేందుకే ఆటో నడుపుతున్నాను. పనులు ఆగిపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. తాపీ మేస్త్రీలు, వారితో పాటు పనిచేసే కూలీలకు సైతం పనిలేకుండా పోయింది.

భృతి కల్పించాలి: పెనగడం.గురవయ్య, సీటూ జిల్లా కార్యదర్శి

గత మూడు నెలలుగా జిల్లాలో వర్షాలు పడుతుండడంతో రోజువారీ కూలీలకు పనులు దొరకడం లేదు. మూడు నెలలకు ప్రభుత్వం రూ. 15 వేలు భ తి ఇవ్వాలి. నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి. మరో తుపాను ముప్పు ఉంటే ముందస్తుగా ఆదుకోవాలి.

ముసుగేసిన ముసురు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వరుస తుపాన్లు, అల్పపీడనాల ప్రభావం ముసురు ముసుగేసింది..జిల్లా వాసులు ఐదు రోజులకు పైగా సూర్యున్ని చూసుంటే ఒట్టు. ఎక్కడికక్కడ జనజీవనం స్థంభించింది. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. విద్యాసంస్థలు నడవడమే కష్టంగా మారింది. కార్మికులకు పస్తులు తప్పలేదు. వర్షాలు, తుపాన్లు ఉంటాయని ముందే ప్రకటించపజేసిన ప్రభుత్వం, బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం గమనార్హం.

దిత్వా తుపాన్ జిల్లాకు పెద్ద ఎత్తున కష్టాలను మిగిల్చింది. ఏడు రోజులుగా కురుస్తున్న వర్షాలు జిల్లాను వణికించింది. భారీ వర్షాల కారణంగా జిల్లా మొత్తం ముసురు తెరల్లో చిక్కుకుంది. సూర్యున్ని చూసి జిల్లా వాసులు వారం రోజులవుతోందటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నగర, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు సైతం ఇంటికే పరిమితమయ్యారు. ఇళ్లంతా తేమ, తడిసిన బట్టలు, మగ్గిన మంచాలు, తాగునీటి కాళాయిల చుట్టు చేరిన మురికి నీరు అబ్బా ఒకటేమిటి అనేక ఇబ్బందులు. వీటికి తోడు చలిగాలులు జిల్లా ప్రజానీకాన్ని వణికించాయి, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. వరి మళ్లు వర్షపు నీటితో మునిగిపోయాయి. తాజా ఆకుకూరలు, కాయకూరలు కరువయ్యాయి. అరాకొర మార్కెటు వస్తే వాటి ధరలు ఆకాశాన్ని అంటాయి. ఒక పక్క కూలీలకు పనులు లేవు. మరో పక్క నిత్యవసర సరుకులకు కాసులు లేవు. అప్పో చొప్పో చేసి కడుపు నింపుకుందామంటే రెక్కలొచ్చిన ధరలు చూసి, బిక్కమొహం వేయల్సాని పరిస్థితి. దీంతో విధిలేక పేదలు పస్తులతో రోజులు నెట్టుకొస్తున్నారు. తుపాను వల్ల తూర్పు మండలాల్లో పంట నష్టం భారీగానే ఉంది. అనేక ప్రాంతాలలో రహదారులు నీటి మయం కావడంతో, పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో మొక్కు చెల్లించేందుకు వెళ్లి ఓ కుటుంబం అడవిలో చిక్కుకున్న ఘటన రాష్ట్రంలో అలజడి సషించింది. ఎటు వెళ్లేందుకు దారి లేక 28 గంటలకు పైగా అడవిల్లోనే తిండి తిప్పలు లేకుండా తల్లడిల్లారు. కుటుంబ సభ్యుల ఇచ్చిన సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమై స్థానికులు, కొంత మంది ప్రజల సహాయంతో వారి గురించి జల్లడ పట్టి, ఎట్టికేలకు 22 మందిని సురక్షితంగా, అడవి నుంచి ఇళ్లకు చేర్చారు. జిల్లాలో డిసెంబరు ఒకటోతేది నుంచి వరుసుగా 26.7 మి.మీ, 24.5, 62.9, 33.2, 38.5, 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వారానికి పైగా వర్షాలు ఎడతెరపి లేకుండా పడుతుండడంతో ఉపాధి కరువై, పస్తులు ఉండాల్సిన పరిస్థితి. ఇంటిలో బియ్యంగింజలు లేవు. చేతుల్లో డబ్బులు లేదు, పనికి వెళ్లాలంటే వర్షాలు, పేదలు బాధలు వర్ణనాతీతం. అయితే ప్రభుత్వం ఎలాంటి సాయం అందించకపోవడంతో, దాతల సాయంతోనే పేదలు సరిపెట్టుకునే పరిస్థితి.

చెరువుల్లో నీటిని కాపాడండి

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఉచ్చూరువారి పాలెం, తిక్కచెరువు నీటిని బయటకు వెళ్ళనీకుండా అడ్డుకుని, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని, తహశీల్దార్ కటారి జయ జయ రావు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌లు సంయుక్తంగా ఇరిగేషన్ అధికారులకు శనివారం వినతి పత్రం అందజేశారు. తిక్కచెరువు నుండి 750 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని ఉచ్చూరువారిపాలెం రైతులు తెలిపారు. తుపానుతో కురిసిన వర్షాలకు తిక్కచెరువు పూర్తిగా నిండిందని తెలిపారు. చెరువు నీటిని భవిష్యత్తు అవసరాల నిమిత్తం రైతులు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ప్రస్తుతం కోట మండలం, వంజివాక గ్రామానికి చెందిన గంగపట్నం చంద్రశేఖర్ రెడ్డి నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పటికీ తిక్క చెరువులో ఉన్న నీటిని వృధాగా బయటకు పంపడానికి గండ్లు కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు తహశీల్దార్, ఎంపీడీవో, ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. అధికారులు స్పందించి చెరువు నీటిని బయటికి వెళ్ళనీయకుండా రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శంకరయ్య, రమేష్, వీర రాఘవయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, చంద్రయ్య, ప్రభాకర్ తదితర రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే రైతులు వారి పొలాలకు తగిన మోతాదులో ఎరువులు వాడాలని తొట్టంబేడు మండల వ్యవసాయ అధికారి సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం జిల్లా వ్యవసాయ కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొట్టంబేడు మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వారి పొలాల్లో ఉన్న మట్టిని భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ ఫలితాలతో ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుస్తుందని, మితికి మించి ఎరువులు వాడితు భూసారం కోల్పోవటమే కాక, రైతులకు పెట్టుబడి ఖర్చులు అధికమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కేంద్రం అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి -సూళ్లూరుపేట : సూళ్లూరుపేట భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శీనయ్య, గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం మృదుల, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు అశోక్, ఆలవల భాస్కర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శీనయ్య మాట్లాడుతూ దివ్యాంగులు బలహీనులు కాదని, వారిలో అపార శక్తి, ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే సమాజానికి గొప్ప సేవ అందించగలరన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులందించారు.

ప్రజాశక్తి- క్యాంపస్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా స్థాయిలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడలను నవంబర్ 28, 29 తేదీలలో నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలోని విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థినులు వివిధ పోటీలలో పాల్గొన్నారు. విజేతలు కలెక్టర్ చేతుల మీదుగా శనివారం బహుమతులు అందుకున్నారు.

వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు) వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. చిరంజీవి రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని తంగేళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి జీవో నెంబర్ 36 అమలుపరచడంలో జాప్యం జరిగిందని, 2019 సంవత్సరం తరువాత నియామకమయిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఆరోగ్య బీమా కల్పించాలని, సహకార సంఘం ఉద్యోగులందరికీ 2019 మరియు2024 వేతన సవరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగులు పి. శ్రీనివాసులు, వాసు, దివ్య, భాస్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి పైపుకు మరమ్మతు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తుపాను ప్రభావంతో గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలతో, వరద ప్రవాహం కారణంగా పట్టణ పరిధిలోని మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతులకు గురైంది. స్థానికులు నీటికి ఇబ్బంది పడుతుండటంతో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టంశ్రావణి రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి, మున్సిపల్ వాటర్ వర్క్‌కి సంబంధించిన సిబ్బందిని పంపి లైన్ రిపేర్ చేసి నీటి సమస్యని పరిష్కరించారు. ఈ లోపు ట్యాంక్‌లతో నీటిని తోలి స్థానికులకు ఇబ్బంది లేకుండా చూశారు.

రేషన్ షాపులు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలో కల్లూరు, ముట్టంబాక రేషన్ షాపులను మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తనిఖీ చేశారు. ఆయన డీలర్లతో మాట్లాడుతూ తూకాల్లో ఎటువంటి తప్పిదాలు జరగకూడదని, లబ్ధిదారులకు అసౌకర్యం లేకుండా సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. షాపుల్లో స్టాకును పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. స్మార్ట్ కార్డులు రానివారిని గుర్తించి వారికి కార్డులు అందజేయాలని డీలర్లను ఆదేశించారు. ఈ తనిఖీల్లో రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, డీలర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్ఐలుగా అశోక్, వెంకటలక్ష్మీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు అర్బన్ అండ్ రూరల్ పోలీస్ స్టేషన్ల నూతన ఎస్సైలుగా అశోక్, వెంకట లక్ష్మీలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మునుపు ఉన్న ఎస్ఐ ఓబయ్య తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయ రికార్డ్స్ ఇంచార్జ్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన అశోక్ తిరుచానూరు నుండి, వెంకట లక్ష్మీ ఏర్పేడు నుండి బదిలీపై వచ్చారు.

రోడ్డు ఏర్పాటుకు భూ సేకరణ

ప్రజాశక్తి - ఓజిలి: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, గ్రద్ద గుంటలో విసిఐసి రోడ్డుకు పర్యవేక్షణ జరిగింది. ఈ భూసేకరణ కార్యక్రమంలో పర్య వేక్షణాధికారిగా ఆర్డీవో కిరణ్మయి వ్యవహరించారు. ఎమ్మార్వో పద్మావతి సమక్షంలో రెవెన్యూ అధికారుల సహాయంతో రైతుల పాసు పుస్తకాలను, సర్వే నంబర్లను, వన్ బి అడంగల్‌ను పరిశీలించి రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయని తెలుసుకొని వారి వద్ద నుండి పది నుండి 15 ఎకరాల వరకు 79 సర్వే నంబర్లను పరిశీలించి భూసేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్ రైతులతో కలిసి ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాల్లో సహకరించాలని కోరారు.

ఆదర్శనీయుడు అంబేద్కర్

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద

శనివారం ఎఐటియుసి మున్సిపల్ కార్మికులు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్, కార్మికులు ఈశ్వరయ్య, కందప్ప, వేణు మురళి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పాకాల : పాకాల మండలంలో శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కేవిపిఎస్ నాయకులు నరేంద్ర, మధు, సిద్ధులు, ఆనంద, ఉదయ్, నాని, వెంకటస్వామి, అజయ్, రాజా, హరి, కుమార్, షన్ముగ, బహుజన ఆటోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోట, పల్లగుంట, కొక్కుపాడులో, గుణపాడు గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మిజూరు మాధవ్, నాయకులు పాల మల్లి, పనబాక హేమంత్, మీదురు శ్రీనివాసులు, దాసరి అశోక్ కాంబ్లె, మీజూరు మల్లి ఖార్జున్ రావు, మస్తానయ్య బహుజన్ ఐక్యవేదిక నాయకులు నవకోటి బాబు రావు, దార్ల ఏడుకొండలు తదితరులు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) అంబేద్కర్ ఆదర్శనీయుడని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు రావిళ్ళ మునిరాజు నాయుడు పేర్కొన్నారు. ఎం.పి.డి.వో కార్యాలయం ఆవరణలో శనివారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, వెంకటసుబ్బయ్య, భాస్కరయ్య, సునీల్, ఖాదర్ తదితరులు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

ప్రజాశక్తి-కోట: కోట మండలం, కార్ స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఎంబేటి వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ పరిసర మండలాల్లోని పాఠశాలల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందచేస్తామని తెలిపారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నామని తెలిపారు. అనంతరం టి.శ్రీనివాసులు, కోటేశ్వరరావు, అవినాష్ నెల్లిపూడి మురళి, మస్తాన్ తదితరులు అబేద్కర్‌కు నివాళి అర్పించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి కెవిపియస్ పట్టణ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, అధ్యక్షుడు అడపాల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు అధ్యక్షుడు పామంజి మణి, కార్యదర్శి బి.వి.రమణయ్య, భవన నిర్మాణ నాయకులు గండికోట మధు, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలో శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. వాకాడు మండల పరిషత్ కార్యాలయంలో ఏవో శ్రీనివాసులు, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, మండల పరిషత్ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేద్కర్ భవనం వద్ద కూటమి నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

ప్రజాశక్తి - నాగలాపురం: ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధనకు కట్టుబడి పని చేయాలని సత్యవేడు ఇంచార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి పురస్కరించుకొని నాగలాపురం ఆర్టీసీ బస్టాండు, మండల కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కూరపాటి శంకర్ రెడ్డి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ బ్యూరో, అంబేద్కర్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ రజనీ బాబా సాహెబ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. యస్వీయు సెనేట్ హాల్లో వర్ధంతి వేడుకలను విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించింది. ఎపి బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట సిపిఎం పార్టీ కార్యాలయంలో నాయకులు శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జయచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సిపిఎం నాయకులు ఈశ్వరమ్మ, సెల్వరాజు, మునిరాజా, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో శనివారం ఉదయం బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ దళిత నాయకులు ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ ఏఎంసి చైర్మన్ జ్యోతి సుధాకరనాయుడు, వైఎస్ఆర్పిపి మండల కన్వీనర్ మనీ నాయుడులు అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైసీపీ మండల అధ్యక్షులు కొణతనేని మణి నాయుడు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పల్లమాల, బియన్ కండ్రిగలో మండల నాయకులతో కలిసి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆర్మీ, స్థానిక టిడిపి నాయకులు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు, పలు ప్రజా సంఘాలు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు అంబేద్కరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటేష్, ఎస్పీ సుబ్బరాయుడు, మాజీ మంత్రి పరసా రత్నం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయిబ్రాహ్మన్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, మాజీ ఎమ్మెల్యే గాంధీ, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ శ్రీధర్ వర్మ, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎంసిడబ్ల్యు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాకళావత్, ఇఎన్‌టి విభాగాధిపతి ఎస్.సి, ఎస్.టి. సెల్ లైసనింగ్ ఆఫీసర్ డాక్టర్ అమర్ నాథ్, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కె.భూపాల్, నర్సింగ్ సూపర్నెంట్ సునీత, స్విమ్స్ ఎంప్లాయిస్, నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు సెక్యూరిటీ, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. యువత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య సూచించారు. ఎస్ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.

ప్రజాశక్తి - చంద్రగిరి : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ స్టేషన్ పరిధిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చంద్రగిరి పట్టణ టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ఎన్ శ్రీరాములు శనివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి కేవైరాజా, రవిచంద్ర, రామారావు, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : అంబేద్కర్ వర్ధంతి వేడుకలు శనివారం ఏర్పేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో డాక్టర్ జి. సౌభాగ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో కోమలేశ్వరి, డిప్యూటీ ఎంపిడివో రమణకుమార్, టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయుల నాయుడు, తిరుమల శెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పుత్తూరు అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ కోనేటి ఆదిమూలం, ప్రధాన కార్యదర్శి ఆపరంజి, ట్రెజరర్ కుప్పయ్య ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలిలో నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి - ఓజిలి: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, కురుగొండలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కురుగొండ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దార అంకయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. బి.రవి, టి.రవి, పి.అంకయ్య, టి.భాస్కర్, టి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి అంబేద్కర్‌కు నివాళులర్పించారు. నాయకులు పెరగడం గురవయ్య, కుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు : అంబేద్క ఆదర్శప్రాయులని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పుత్తూరు, కార్వేటినగరం కూడలి వద్ద, నారాయణవనం బైపాస్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నివాళి అర్పించారు. అనంతరం తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తదుపరి బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కుక్కం బాక్కం గ్రామానికి చెందిన బాధితుడు కే.బాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.44 లక్షల చెక్కును కలెక్టర్ వెంకటేశ్వర్లు ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణం, అదనపు తరగతి గదులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు.

సిఐటియు అఖిలభారత మహాసభలకు తోడ్పాటునివ్వండి

ప్రజాశక్తి - సత్యవేడు: 31 నుంచి జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభకు తోడ్పాటు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ సత్యవేడులో నిర్వహించిన మాస్ క్యాంపైన్‌లో స్థానిక ప్రజలను కోరారు. ఈ సందర్భంగా శనివారం మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలను చర్చించి సమరశీల పోరాటాలను చేపట్టేందుకు విశాఖపట్నంలో 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కోటమిట్ట ప్రాంతంలో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటా కర పత్రాలను పంచిపెట్టి మాస్ కాంపైన్ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణాచలం, మండల అధ్యక్షులు భాస్కర్, సత్యవేడు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి తిరుమలరెడ్డి, గ్రీన్ అంబాసిడర్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌పై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరంలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవనాలు, అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్ల క్రమబద్దీకరణ కోసం ప్రభుత్వం అందించిన ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో శనివారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల వారీగా ఎల్ఆర్ఎస్, బీపీఎస్, ఐ.పి.ఎల్.పీ దరఖాస్తులు, పరిష్కారం పై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లను గుర్తించి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. ఆగష్టు 31 వ తేదీ లోపు జరిగిన నిర్మాణాలను ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా క్రమబద్దీకరణ చేసుకోవాలని ప్రజలకు తెలపాలన్నారు. గడువు అనంతరం క్రమబద్దీకరించుకోని భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై బిపిఎస్ అవకాశం రాదనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. డిసిపి ఖాన్, ఏసీపీలు మూర్తి, మధు, టిపిబివోలు వంశి, సంతోష్, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ వినతి

తిరుపతి టౌన్ : తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు ఎస్.మీరయ్య, ప్రధాన కార్యదర్శి కె.యోహాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎన్.మనోహరం, వి.మైఖేల్యేంద్ర ప్రభుత్వానిక విజ్ఞప్తి చేశారు. శనివారం రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవకు, పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు.

నో హెల్మెట్.. నో పెట్రోల్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో సీఐ.మురళీకష్ణ, ఎస్సై.బ్రహ్మనాయుడు ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పించారు. శనివారం సూళ్లూరుపేటలో ఉన్న పెట్రోల్ బంక్స్ యాజమాన్యం వారితో మీటింగ్ ఏర్పాటు చేసి, ఈ నెల 15 వ తేదీ నుండి హెల్మెట్ లేకుండా పెట్రోల్ కోసం వస్తే ఇవ్వవద్దు అని, దీనికి సంబంధించి 'నో హెల్మెట్...నో పెట్రోల్' నినాదంతో అవగాహన కల్పించాలన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : పేదల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఐదేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. శనివారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పేదలకు నివేశ స్థలం, గృహ నిర్మాణం కల్పించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నామని తెలిపారు. మొదటి విడతగా ప్రతి మండలంలో రోడ్లకు 2 కోట్లు అభివృద్ధి నిధులను ఎన్ఆర్ఇజెసి గ్రాంట్ కింద పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రెండవ విడత కింద 1.5 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారిక సూచించారు. 4.1 కిలోమీటర్ వేణుంబాక రోడ్డు నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. వెదురుపట్టు గ్రామ ప్రజలు సర్వే నంబర్ 131 లో పట్టాలు ఇచ్చారు కానీ భూమి చూపించలేదని ఫిర్యాదు చేశారు. ఆనేపూడి పూల తోట రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు అర్జీ సమర్పించారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీలు 58 కాగా వాటిలో పంచాయతీరాజ్ శాఖకు 21 అర్జీలను సమర్పించారు. 14 రెవెన్యూ, ఇతర శాఖల నుండి మరికొన్ని ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది.

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

In The Court of The III Addl. District Judge : Nellore

A.S.No. 97 / 2023

T.Gurutheja Reddy - Appellant

Vs

1. T.Jayachandra Kumar Reddy @ J.K. Reddy & 6 others - Respondents

Notice to 1st Respondent

To,

R1. T.Jayachandra Kumar Reddy, @ J.K.Reddy, S/o **Jayarami Reddy,** Employee, and Landlord, residing at D.No. 19-9-29/12, Postal Colony, Tirupati.

పై నెంబరు కేసులో అప్పిలెంటు మీ మీద పై వారి కోర్టులో అప్పీలు దాఖలు చేసియున్నారు. సదరు అప్పిలులో మీకు నోటీసు నిమిత్తం **తే22-12-2025ది** కి వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం 10.30 గం॥ లకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

B.V. Sudheer Kumar, B.Com., L.L.B., Advocate
23-598, Sagilavari Street, Fathekhanpet, Nellore, Cell: **9985556553**

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.NO.124/2025

నెల్లూరు మురళి ...వాది

వర్సెస్

ఎం.ఎస్. లవకుమార్ ...ప్రతివాది

దావానోటీసు

ఎం.ఎస్.లవకుమార్, తండ్రి ఎం.ఎస్.వెంకట సుబ్బయ్య, డోర్ నెం. 3-5-220, ఆత్రేయవీధి, సూళ్ళూరుపేట పోస్టు, టౌన్ & మండలం, తిరుపతి జిల్లా.

ఇందుమూలముగా మీకు తెలియజేయడ మేమనగా పై తెలిపిన వాది పైకోర్టులో మీపై దావావేసి మీకు దావా నోటీసులు పంపినను మీకు జారీ కానందున పైకోర్టువారు మీ హాజరు నిమిత్తం వాయిదా తే 17.12.2025దిన వేసి యున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10:30ని॥లకు స్వయంగాగానీ మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును లేనిచో మీ పరోక్షమున ఏమియును లేదని శ్రీకోర్టువారు తీర్మానించెదరు.

ఇట్లు
యల్.గణపతి, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది, సూళ్ళూరుపేట

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

(In the matter of Minors : 1. Pulukollu Lohitha, daughter of Late Venkateswara Rao (Minor) 2. Pulukollu Chakradhara, Son of late Venkateswara Rao, (Minor), represented by their guardian / mother namely Pulukollu Rajani wife of late Venkateswara Rao, permanent resident of D.No.23/99, Pulukollu Street, Venkatagiri Town, Tirupati District, i.e. the petitioner herein).

G.O.P. No. 30 /2025

1. పులుకొల్లు లోహిత, తండ్రి లేట్ వెంకటేశ్వరరావు (మైనర్)
2. పులుకొల్లు చక్రధర, తండ్రి లేట్ వెంకటేశ్వరరావు (మైనర్)
3. పులుకొల్లు రజని, భర్త లేట్ వెంకటేశ్వరరావు ....పిటీషనర్స్

V/s

Nil ....రెస్పాండెంట్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై తెలిపిన నెంబర్ **G.O.P. No. 30 /2025** లోని మైనర్స్ అయిన పులుకొల్లు లోహిత మరియు పులుకొల్లు చక్రధరలకు వారి తండ్రి గారి ద్వారా సంక్రమించిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో వారియొక్క భాగం అమ్మెందుకు వారి తరపున వారియొక్క తల్లిగారైన 3వ పిటీషనర్ పై తెలిపిన మహారాజశ్రీ గౌరవనీయులైన గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు పిటీషన్ దాఖలు చేసి వున్నారు. పై నెంబర్ కేసులో పై కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము తే. 19-12-2025 దిన వాయిదా వేసియున్నారు. పై విషయమై ఎవ్వరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో అట్టి వారు తే. 19-12-2025 దిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు నందు వ్యక్తిగతముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఆస్థి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, గూడూరు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, వెంకటగిరి సబ్-డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ ఇలాకా, వేంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి టౌన్ మరియు మండలం సర్వే నెం. 279 రు పులుకొల్లు వీధిలోని, అసెస్మెంట్ నెం. 1127010052, డోర్ నెం. 23-99 లోని విస్తీర్ణం 29.33 అంకణముల గల ఆర్.సి.సి మిద్ది ఇంటికి స్థలమునకు హద్దులు: **తూర్పు :** పులుకొల్లు శేషమనాయుడు స్థలం కొంత వరకు ఇల్లు కొంతవరకు , **దక్షిణం :** రోడ్డు, **పడమర :** వీధి కొంత వరకు, కొత్త రఘురాం ఇల్లు కొంత వరకు, **ఉత్తరం :** నాగారపు పాపారావు ఇల్లు.

ఇట్లు
సి.వి.వి. సాయి వర ప్రసాద్, బి.ఎ., బి.ఎల్.,
పిటీషనరు తరుపు న్యాయవాది
వెంకటగిరి.

క్రైం న్యూస్

బంగారు నగల చోరీ

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, కె వడ్డే పల్లి పంచాయతీ, అచ్చమ్మ అగ్రహారంలో నివాసం ఉంటున్న దామోదర్ నాయుడు ఇంట్లో 25 గ్రాముల బంగారు చోరీ అయినట్లు బాధితుడు పాకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు తాము గత రెండు రోజులు క్రితం గుంతకల్ ఉన్న తమ కుమారుడు ఇంటికి వెళ్లామని, దుండగులు పథకం ప్రకారం శుక్రవారం రాత్రి తలుపులు తొలగించి, ఇంట్లో బీరువాలో ఉంచిన 25 గ్రాములు బంగారం దోచుకుని వెళ్లినట్టు తెలిపారు. పొరుగువారు తెలియజేయడంతో శనివారం ఇంటికి వచ్చి పోలీసుల సమక్షంలో పరిశీలించగా తాళం వేసిన బీరువాలో ఉంచిన 25 గ్రాముల బంగారు నగలు చోరికి గురైనట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన పిర్యాదుతో పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 14 మంది అరెస్ట్

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచుగా జడ్జ్ ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. జె ఎం ఎఫ్ సి నాయుడుపేట కోర్టు మెజిస్ట్రేట్ పి.మీనాక్షి సుందరి జరిమానా వేసినట్లు తెలిపారు.

రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు-పూడి రైల్వే మార్గంలో శనివారం జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రైల్వే అధికారులిచ్చిన సమాచారం మేరకు, పుత్తూరు నుంచి పూడి దిశగా వెళ్తున్న రైలు మార్గం వద్ద సుమారు 75 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి పడి తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. మృతుడు తెలుపు రంగు హాఫ్ షర్టు, ఎర్ర బార్డర్ ఉన్న తెల్ల పంచ ధరించి ఉన్నాడని తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలని పుత్తూరు రైల్వే పోలీస్ అధికారులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లోకి రామచంద్రన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: జై భీమ్ సేన రాష్ట్ర వ్యవస్థాపకులు, అధ్యక్షులు పవర్ పి.రామచంద్రన్ విజయవాడలో ఏపీ పిసిసి అధ్యక్షురాలు షర్మల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా ఆయన విజయవాడలోని భారీ అంబేదర్ విగ్రహం వద్ద తన అనుచరులు జై భీమ్ సేన రాష్ట్ర నాయకులు ఎంజె బాబు, కెఎస్ రఘు, జై భీమ్ సుధాకర్ పాల్, నగరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సికె కార్తికేయన్‌లతో కలిసి అంబేద్కర్‌కు నావాళి అర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకొని ఏపీ పిసిసి అధ్యక్షులు షర్మిలా రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు భాస్కర్, సి కె కార్తికేయన్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

In the Court of the VII Addl District Judge, Gudur

E.P.NO. 174 / 2019

A.C.P.No: 2 / 2018

Mis The Water Base Limited,
Rep.by it's Legal Officer,
J.V.Sreedhar Rao,
Kodavaluru Village & Mandal,
SPSR Nellore District. ....Petitioner/Decree Holder

VS

M/s N.R.Aqua Feeds,
Rep, by Managing Partner,
Mr. Maddali Sarvotham Reddy,
Door No.2264, N.H.5, Near Service Road.
Potupalem Village, Gudur Mandal,
SPSR Nellore District. and 3 others.
....Respondents/Judgment Debtors

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని 7వ అదనపు జిల్లా జడ్జి వారి ఆదేశానుసారంగా తే. 23-12-2025 దిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో వేలము వేయుదురు, కావున వేలములో పాల్గొనువారు పై తేదీన వేలములో పాల్గొని వేలములో పై కోర్టు వారు నిర్ణయించిన షరతుల ప్రకారం పాడుకోవలసినదిగా మనవి.

షెడ్యూలు

Item No.I. SPSR Nellore District-Gudur Registration District, Kota Sub Registrtion, Kota Mandal, Kota Panchayat, Kota Bit-1. in Kota Village-Dry land, Survey No.1239/1-2 Ac.1-02 cents out of Ac.8-30 cents and the same is situated within the following boundaries:
East: 33 feets width Road;
South: Gudur-Dugarajapatnam Road;
West: Land of Mohan Reddy;
North: B.C.Residential School to some extent the remaining extent belongs to J.Dr No.2 in S.No. 1239/1-2;

Item No.II. SPSR Nellore District-Gudur Registration District, Kota Sub Registrtion, Kota Mandal, Kota Panchayat, Kota Bit-1, in Kota Village-Dry land, Survey No.1239/1-2 Ac.1-02 cents out of Ac.8-30 cents and the same situated within the following boundaries:
East: Land of P. Jithendra Kumar Reddy,
South: Gudur-Dugarajapatnam Road:
West: Land of Maddali Supriya (J.Dr No.4);
North: B.C.Resdiential School;

Item No.III SPSR Nellore District-Gudur Registration District, Kota Sub Registrtion, Kota Mandal, Kota Panchayat, Kota Bit-1, in Kota Village-Dry land, Survey No.1239/1-2 Ac.1-10 cents out of Ac.8-30 cents and the same is situated within the following boundaries;
East; Land of Nemallapudi Aruna (J.Dr No.3);
South: Gudur-Dugarajapatnam Road;
West: Bund;
North: B.C.Residential School;

SCHEDULE

ItemNo:4

SPSR Nellore District, Gudur Registration District, Kota Sub Registation, Kota Mandal in Nellurpalli Village covered by:

Survey No:	Extent:	Classification
148	Ac.0-95 cents	Dry
143-1A	Ac.0-75 cents	Dry
127-2	Ac.0-25 cents	Dry
124-4	Ac.0-31 cents	Dry
124-3A	Ac.0-59 cents	Dry
124-2	Ac.0-32 cents	Dry
	Total Ac.3-17 cents	

Or 1.283 Hectares is situated within the following boundaries:
East: Some extent of Nedurumalli Prasanna Kumar Reddy and some extent of Yaratapalli Sreehari Reddy;
South: Kappala Panta Canal;

Gudur, Dt. 07-12-2025.

Total D.Hr. Value Rs. 1,93,00,000/-
Total Ami Value Rs. 3,45,70, 000/-
Market Value Rs. 6,31,03,600/-

ఇట్లు
పి. వి. సాయికుమార్ రెడ్డి,
D. H.R. తరుపు న్యాయవాది,గూడూరు.

వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి - చిల్లకూరు : తుపాను నేపథ్యంలో 850 వరద బాధిత కుటుంబాలకు మీనాక్షి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారు శనివారం ఆహార పొట్లాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో భీమ రాఫెల్, హెడ్ అడ్మిన్ శివరామకృష్ణారావు, మహదేవ్, వీఆర్వో ఉదయ్ కుమార్, మన్నెగూడ సర్పంచ్ ఏడుకొండలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించొచ్చు

ప్రజాశక్తి - రామచంద్రపురం : మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చని అంగన్వాడి పర్యవేక్షకులు కె.మనీలా పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం, సి రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం "మిషన్ శక్తి సంకల్ప" కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలలో పోషకాహార లోపం, క్యాన్సర్ నివారణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థం వంటి విషయాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు బాల సరస్వతి, వరాలు అంగన్వాడీ కార్యకర్త వెంకట మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - కెవిబి పురం: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తీరుకు వ్యతిరేకంగా ఆయన దిష్టిబొమ్మను కెవిబిపురంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం బీసీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన సిట్, ఇతర నేర చరిత్రను వెలికి తీసే విభాగాల్లో నీతిగా పనిచేసే బీసీ అధికారులను టార్గెట్ చేసుకొని జగన్మోహన్ రెడ్డి ఏక వచనంతో దురుసుగా మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. యాదవ సామాజిక వర్గానికి సంబంధించిన ఐపీఎస్ అధికారి గోపినాథ జెట్టి, కృష్ణయ్యలను ప్రత్యేకించి టార్గెట్ చేసి మాట్లాడటంపై రాష్ట్రంలోని యాదవ సామాజిక వర్గం గమనిస్తుందని హెచ్చరించారు. అనంతరం శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన మార్గంపై సాయిబాబా ఆలయం కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్ నాయుడు, ముని కృష్ణారెడ్డి, రఘు యాదవ్, సురేష్ చౌదరి, వాసు నాయుడు, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయించండి

ప్రజాశక్తి-సత్యవేడు: చిత్తూరులో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సత్యవేడు మండలంలో పలుమార్గాల్లో దెబ్బతిన్న రోడ్ల దుస్థితిపై స్థానిక ఎంపీపీ ప్రతిమ ప్రస్తావించారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో పలు అంశాలను ఎంపీపీ ప్రతిమ లేవనెత్తారు. ప్రధానంగా సత్యవేడు-ఊత్తుకోట, సత్యవేడు-మాదర్పాకం, వెంకట రాజుల కండ్రిగ- నాగలాపురం వంటి ప్రధాన మార్గాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బన్నాయని తెలిపారు. ఈ రోడ్లకు మరమ్మతుల చేపట్టి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. సత్యవేడు మండలం ఇరుగుళం హైస్కూలును జూనియర్ కళాశాల స్థాయికి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు) మండలంలోని ఇలగనూరు పంచాయతీ ఎస్టీ కాలనీలో నివసిస్తున్న సుమారు 40 కుటుంబాల వారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు చేతుల మీదుగా శనివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కొనతనేరి పంచాయతీలో ఎగువ కొనతనేరి, దిగువ కొనతనేరి చెరువుల్లో గిరిజనులు చేపలు పట్టుకోవడానికి అప్పట్లో వీధుల్లో ఉన్న కలెక్టర్‌తో చర్చించి జీవో పాస్ చేయించడం జరిగిందన్నారు. దీనివలన ఈ ప్రాంత గిరిజనులకు బ్రతుకుతెరువు ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు, మునిరత్నం నాయుడు, లెక్కల రవి నాయుడు, ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు ఎస్సై బదిలీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగబాబు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు. వాకాడులో ట్రైనింగ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆర్.నిఖిల్ బాబు వాకాడు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

వడమాలపేట ఎస్ఐగా హరీష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బిహరీష్ శనివారం సాయంత్రం 5 గంట లకు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఉన్న ఎస్ఐ ధర్మారెడ్డి రేణిగుంటకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హరీష్, పాకాల పి.ఎస్‌నుంచి నేడు వడమాల పేట మండల ఎస్ఐ గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూదం, గంజాయి, మద్యం, వంటి అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తిరుపతి జిల్లా డి ఎం హెచ్ ఓ బాలకృష్ణ నాయక్ తనిఖీ చేశారు. హాస్పిటల్లోని సమస్యలను, డాక్టర్లు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. మందులు, పలు రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో బాలిరెడ్డిపాలెం మెడికల్ ఆఫీసర్ తులసీదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కోకా-కోలాలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక కోకా-కోలా ప్రతిభ కార్యక్రమంలో అప్రెంటిస్ విధానంలో ఉద్యోగావకాశాలున్నట్లు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజా నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల కోసం ఈ నెల 8వ తేదిన తమ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన 35ఏళ్ల లోపు వయసున్న యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9440502338, 7981473129 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

కూటమి పాలనలో గంగమ్మ ఆలయ అభివృద్ధి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ విస్తరణ పూర్తిస్థాయిలో చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అన్ని మౌలిక వసతుల కల్పనకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. ఆలయంకు వాయువ్య దిశలో ఉన్న ఇంటిని దాతల ఇచ్చిన యాభై లక్షలతో ఆలయ యాజమాన్యం కొనుగోలు చేసింది. ఆ ఇంటి పత్రాలను యజమానురాలు మంజుల శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందజేశారు. అనంతరం ఆ ఇంటి కూల్చివేత పనులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎంతో మహిమ గల తాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ఆలయ విస్తరణను ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఏడాదికి ఒకసారి జరిగే జాతర సందర్భంగానే కాకుండా ప్రతి వారం భక్తుల రద్దీ కొనసాగుతున్నందున విస్తరణకోసం ఆలయాన్ని ఆనుకుని ఉన్న స్థలాన్ని దాతల సాయంతో కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ఈశాన్యంలోని బిల్డింగ్ యజమాని ఆలయానికి ఆ బిల్డింగ్ ఇస్తే దాతల సాయంతో విస్తరణ పనులను పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. టిటిడి ఆలయ అభివృద్ధి పనులకు మూడు కోట్ల తొంభై లక్షల రూపాయలు అందించిందని ఆయన తెలిపారు. గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి పాలకమండలి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నదని ఆయన అభినందించారు. గంగమ్మ తల్లి ఆలయానికి తన ఇంటిని అమ్మిన యజమానురాలికి, దాతలకు గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ పూజా విజయ్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళి, జెబి శ్రీనివాస్, జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, రాజేష్ ఆచార్యాలు, ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే విద్యలో మెలకువలు నేర్పించడమే మా లక్ష్యం

ప్రజాశక్తి పుత్తూరు టౌన్ : బాల్యం నుంచే విద్యలో అవసరమైన మెలకువలు, నైపుణ్యాలు పెంపొందించడం వివేకానంద విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని కరస్పాండెంట్ సాహితీ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆంగ్ల భాషపై నిర్వహించిన ఎక్స్ పో 2.0 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి, చిన్నారులు ప్రదర్శించిన ఆంగ్ల భాషా నైపుణ్యాలను పరిశీలించి అభినందించారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గేట్ పుత్తూరు, వివేకానంద జూనియర్ పాఠశాలలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు స్వయంగా తయారుచేసిన పరికరాలు, ప్రకృతి సిద్ధ వస్తువులతో రూపొందించిన మోడళ్లు, రోజువారీ జీవితంలో ఉపయోగించే పరికరాలను ఆవిష్కరించారు. సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు తల్లిదండ్రులు వివేకానంద విద్యాసంస్థలను ప్రశంసించారు. కార్యక్రమంలో వివేకానంద విద్యాసంస్థల ఛైర్మన్ సదాశివం, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్‌లో హెల్మెట్ లేకుంటే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి - తిరుమల: రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, మీ భద్రత కోసం అంటూ ఘాట్ రోడ్‌లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరని ట్రాఫిక్ సి.ఐ హరిప్రసాద్ స్పష్టం చేశారు. టిటిడిలో అధికారులకు సూచనలతో కూడిన నోట్ ను ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం కు అందజేశారు. మీరు మీ క్రింద పనిచేసే సిబ్బంది ఘాట్ రోడ్లో ప్రతిసారి హెల్మెట్ ను తప్పనిసరిగా వాడాలని కోరారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వివరించారు. భద్రత మీ కోసం బాధ్యత మన అందరిది అంటూ టిటిడి అధికారులవద్దకు వెళ్లి క్రింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా ప్రయాణించండి వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీస్ విభాగం పలు సూచనలు చేశారు.

హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ : సీఐ బాబి

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇకపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉంటేనే వాహనాలకు పెట్రోలు పట్టాలని నాయుడుపేట అర్బన్ సీఐ ఎం బాబి పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు సూచించారు. నాయుడుపేట టౌన్, మండల పరిధిలో వాహన ప్రమాదాలు నివారించడానికి నాయుడుపేట పోలీసు వారు ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం పెట్రోల్ బంక్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి కార్యక్రమం పై అవగాహన కల్పించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిఐ బాబీ మాట్లాడుతూ నాయుడుపేటలో ఉన్న పెట్రోల్ బంకులు యజమాన్యులకు టూవీలర్ వాళ్ళకి హెల్మెట్ లేనిదే పెట్రోల్ ఇవ్వరాదని తప్పనిసరిగా పోలీసు వారితో సహకరించి ముందుగా ఒక వారం రోజులపాటు ఈ కార్యక్రమం పై వాహనదారుల అందరికీ అవేర్నెస్ కల్పించవలసినదిగా పెట్రోల్ బంకుల యాజమాన్యాన్ని కోరారు. వారం రోజుల తర్వాత నుండి టూవీలర్ వాహనదారులకు ఎక్కడ కూడా హెల్మెట్ లేనిదే పెట్రోల్ పట్టరని తెలియజేశారు. అలాగే పెట్రోల్ బంకుల దగ్గర హెల్మెట్ పై అవేర్నెస్ కలిగించే ఫ్లెక్సీలను పెట్రోల్ బంకులు వారికి అందజేసి, ఫ్లెక్సీలను పెట్రోల్ బంకుల వెలుపల ప్రతి ఒక్కరికి కనిపించే విధంగా కట్టించవలసినదిగా సూచించారు. ప్రజల రక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని పెట్రోల్ బంక్ యాజమానులు,ద్విచక్ర వాహనదారులు బాధ్యతగా తీసుకుని ప్రమాదాల నివారణకు పోలీసు వారితో సహకరించవలసిందిగా సీఐ బాబి కోరారు.

కొనసాగుతున్న క్రీడా సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండవ దశ క్రీడా సాంస్కృతిక పోటీలలో భాగంగా వ్యవసాయ కళాశాల తిరుపతి నందు రెండవ రోజు జరిగిన వివిధ అంశాలలో 19 కళాశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులు వివిధ అంశాలలో పోటీపడ్డారు. రెండో రోజు ముఖ్యంగా టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చదరంగం, వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, కార్టూనింగ్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ తెలిపారు. వెటర్నరీ కళాశాల ఆడిటోరియం నందు వివిధ సాంస్కృతిక అంశాలలో ముఖ్యంగా భరతనాట్యం, జానపద నత్యాలు వంటి అంశాలలో వివిధ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పోటీ పడ్డారు. వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి రామచంద్రరావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు, కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇన్చార్జ్ డాక్టర్ కే హరిప్రసాద్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజలలో చైతన్య నింపుతూ వారి హక్కులను వారికి తెలియజేయడానికి దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర 20వ మహాసభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సంఘం కన్వీనర్ క్రాంతి చైతన్య పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను పౌర చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు సీనియర్ పాత్రికేయుడు రాఘవ శర్మ, సీనియర్ పాత్రికేయుడు నాగరాజు, హేమాద్రి లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రాంతి చైతన్య మాట్లాడుతూ 2026 జనవరి 10, 11వ తేదీలలో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనవంతులకు పెట్టుబడి దారి సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ వ్యవస్థలను దోచిపెడుతోందన్నారు. భూ సేకరణ చట్టం అడ్డు పెట్టుకొని మూడు పంటలు పండే పంటలను లాక్కున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల పరిపాలన జరగడం లేదని, కేవలం రెవిన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రసాద్, వాసు పాల్గొన్నారు.

పోలీసు వృత్తి సాధారణ ఉద్యోగం కాదు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: క్రమశిక్షణ ప్రతి పోలీస్ అధికారికి ప్రాణం వంటిది జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా పోలీసు గెస్ట్ హౌస్‌లోని కానారేన్స్ హాల్‌లో, ఇటీవల జిల్లా పోలీసు శాఖలో నియమితులైన ఎస్ఐలతో జిల్లా ఎస్పీ సి.ఎల్. సుబ్బరాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించి విధి నిర్వహణ పట్ల వారికి స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ%ా% విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత, నైతిక విలువలు తప్పనిసరని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే సేవలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యకు దారితీసే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఎస్ఐ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ప్రతీ పౌరుడు మన కుటుంబ సభ్యుడని భావించి, వారికి చేరువగా ఉండాలి. సమస్యలు చెప్పుకునే ప్రతి వ్యక్తిని ఆప్యాయంగా ఆదరించి ఆలకించి, న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి సమస్యపై వెంటనే స్పందించడం, చట్టాన్ని సమానంగా అమలు చేయడం, పారదర్శకతను పాటించడం, మహిళలు-పిల్లలు-సీనియర్ సిటిజన్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ ఆదేశించారు. సాంకేతిక నైపుణ్యం విచారణలో కీలకం సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, డిజిటల్ ఆధారాల సేకరణ, సీసీ కెమెరా విశ్లేషణ, ఆధునిక పరికరాల వినియోగంపై కొత్త ఎస్ఐలు అనుభవాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. సేవా భావంతో పని చేయాలి ప్రతీ సంఘటనను మానవత్వంతో చూడడం, బాధితులకు ధైర్యం చెప్పడం, న్యాయం చేసే దిశగా తక్షణ చర్యలు తీసుకోవడం పోలీస్ శాఖ విధి, పబ్లిసిటీ అవసరం లేదని మనం చేసే పనే మనకు ఉత్తమ గుర్తింపు ఇస్తుందని అనవసరమైన అడ్డదారులకు ఆస్కారం ఇవ్వకూడదని అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఎస్పీ గుర్తుచేశారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖలో కొత్తగా చేరిన ఎస్ఐలు ప్రజల కోసం ఉత్తమ సేవలు అందిస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు రవిమనోహర ఆచారి, శ్రీనివాసులు, సీఐ విక్రమ్, అర్ఐ హరికృష్ణ, ఎస్ ఐలు పాల్గొన్నారు.

హోంగార్డ్స్ సేవలు నిబద్ధతకు నిదర్శనం

ప్రజాసేవలో హోంగార్డ్స్ సేవలు నిబద్ధతకు నిదర్శనమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా.. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం హోంగార్డ్స్ ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. హోంగార్డ్స్ అంటే తక్కువ కాదు, కానిస్టేబుల్ అంటే ఎక్కువ కాదు మనమందరం ఒకటే పోలీస్ కుటుంబమని, మీ సేవలు అత్యంత విలువైనవి అని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం మెడికల్ హెల్త్ క్యాంప్, శారీరక దృఢత్వం కోసం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించబడుతున్నాయని తెలిపారు. సుదీర్ఘకాలం సేవలందించి పదవి విరమణ పొందే వారికి ప్రోత్సాహక నగదు అందిస్తామని భరోసా ఇచ్చారు. విధినిర్వహణలో ప్రత్యేక ఉత్తమత ప్రతిభ కనపరిచిన హెూంగార్డ్స్ సేవలను ప్రశంసిస్తూ, సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహర ఆచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, శ్రీనివాస రావు, ఏఓ రమేష్ కుమార్, డీఎస్పీలు, సీఐలు ఆర్ఐలు, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ విశిష్ట సేవలకు ప్రశంస

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర అరవింద్ హాస్పిటల్ వారు వైద్యశాలల యందు పేదలకు విశిష్ట సేవలు అందించిన వారికి శనివారం ప్రశంస పత్రం అందజేశారు. ఈ ప్రశంసా పత్రానికి నాయుడుపేట రోటరీ క్లబ్ వారు ఎంపికయ్యారు. ప్రశంసా పత్రాన్ని తీసుకునేందుకు నాయుడుపేట రోటరీ క్లబ్ తరపున ప్రెసిడెంట్ ఎలెక్ట్ రామ మోహన్,చంద్రశేఖర్ పాల్గొని తిరుపతిలో అరవింద్ హాస్పిటల్ వారు అందజేసిన ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ నాయుడుపేట రోటరీ క్లబ్ వారు మా హాస్పిటల్ తరపున ఐ క్యాంపు నిర్వహించి ఎంతోమందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఎంతోమందికి ఉచితంగా ఆపరేషన్ చేసి చూపునందించడంలో మాకు ఎంతగానో సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా నాయుడుపేట మరియు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం,ఎంతో మంది నిరుపేదలకు క్లబ్ తరపున అందిస్తున్న వైద్య సేవలు,ఒంటరి మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందే విధంగా చేయూత అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని నాయుడుపేట రోటరీ క్లబ్ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ రాము మోహన్ మాట్లాడుతూ మేము చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఆసుపత్రి తిరుపతి వారు అందించిన ప్రశంసా పత్రం చాలా ఆనందంగా ఉంది. మేము చేసే ప్రతి కార్యక్రమం విజయం వెనక మా రోటరీ క్లబ్ సభ్యులు సహకారం మరియు కొంతమంది దాతల దాతృత్యం ఎంతో ఉందని అన్నారు. అరవింద్ ఆసుపత్రి వారిచ్చిన ప్రోత్సాహం మరింత బాధ్యతలు పెంచి ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెళ్లకూరు చాగనం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ గౌరీ శంకర్, మరియు శ్రీ వెంకటేశ్వర అరవింద హాస్పిటల్ వైద్యులు సిబ్బంది యాజమాన్యం వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

భానుప్రకాష్ రెడ్డి తన నిజాయితీని నిరూపించుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి బోర్డు సభ్యుడుగా రెండో పర్యాయం కొనసాగుతున్న భానుప్రకాష్ రెడ్డి తాను ఏ వ్యాపారం చేసి ఆస్తులు కూడ పెట్టారో ప్రజలకు వివరించాలని, ఎప్పుడు వ్యక్తులను టార్గెట్ చేసుకొని మాట్లాడడం సరికాదని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరే అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భానుప్రకాశ్ రెడ్డిపై గతంలో శ్రీవారి టికెట్ల వ్యవహారం తెరపైకి వచ్చినప్పుడు అనేక పర్యాయాలు దర్శనాల కోసం బోర్డు సభ్యుడుగా ఆయన ఎన్ని లెటర్లు ద్వారా ఎంత మందిని దర్శనం చేయించారు చెప్పాలని డిమాండ్ చేసిన ఇప్పటివరకు స్పందించలేదన్నారు. కల్తీనెయ్యి వ్యవహారానికి సంబంధించి బోలె బాబా డైరీతో 2018 జూన్ 26న ఒప్పందం చేసుకుంది అప్పటి టిడిపి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మరి కల్తీ జరిగింది అని ఎవరు ఫిర్యాదు చేస్తే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాక్షేత్రంలో ఈ వ్యాఖ్యలు చేశారు... మొదటగా ఆయనను కదా విచారించాల్సింది అని అన్నారు. 2019 నుండి 24 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో పరకామణిలో డాలర్లను దొంగతనం చేసిన రవికుమార్ ను పట్టుకున్నామని, ఆయన తన తప్పు ఒప్పుకుని లోకదాలత్ లో రాజీ చేసుకుని 14 కోట్లు విలువ చేసే తన ఆస్తులను టిటిడికి రాసి ఇవ్వడం జరిగిందన్నారు. శ్రీవారి లడ్డు తయారీలో గో మాంసాలకు సంబంధించిన కొవ్వు పదార్థాలను కల్తీనెయ్యిలో కలిపి వినియోగించి భక్తులకు సరఫరా చేశారని చెప్పిన చంద్రబాబు నాయుడును సిబిసిఐడి అధికారులు విచారించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డిని ప్రజల ముందు తప్పుగా చూపించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని ఆరోపణలు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వైసీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని బాబు, మద్దాలి శేఖర్, తాళ్లపాక మోహన్, నరేంద్ర పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉపాధ్యాయులు తరగతిగదిలో పాఠాలతోపాటు పిల్లలలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికి తీయాలని సిల్వర్ ఓక్స్ ద స్కూల్ ఛైర్మన్ కె.ఎస్ వాసు పిలుపునిచ్చారు. స్థానిక భవాని నగర్ లోని సిల్వర్ ఓక్స్ ద స్కూల్ 12వ వార్షికోత్సవం "లా ఫైయిష్ట" వేడుక మహతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పుస్తకాలకే పరిమితం చేయకుండా, అభివృద్ధి దిశగా తీసుకెళ్ళడానికి పాఠశాల కృషి చేస్తోందన్నారు. వార్షికోత్స వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఎస్ఎస్సి-2025 లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మెడల్స్‌తో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ జి.శిరీష, ప్రైమరీ ఇన్చార్జ్ బి.లావణ్య, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ మంజులాదేవి, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ కే. హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పారిశ్రామిక రంగం పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించేందుకు పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు శనివారం ఎం.ఎస్. శివకుమార్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్శనతో ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత నియంత్రణ మొదలైన అంశాలను విద్యార్థులు తెలుసుకుంటారని డాక్టర్ తిరుమలయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమలయ్య, డాక్టర్ గంగయ్య, డాక్టర్ శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - బుచ్చిరాయుడు కండ్రిగ: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) బిఎన్ కండ్రిగ మండల శాఖ నూతన కార్యవర్గం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సీనియర్ నాయకులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, గజేంద్ర పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ముని శేఖర్, ఆర్థిక కార్యదర్శిగా జగన్నాథం, గౌరవ అధ్యక్షులుగా నాదెండ్ల మురళి, గౌరవ సలహాదారుగా పార్థసారథి, ఉపాధ్యక్షులుగా చైతన్య, లీలాప్రసాద్, బాలసుబ్రమణ్యం, రవి, జగదీష్, కార్యదర్శులుగా ప్రవీణ, పద్మావతి, తిరుమలరావు, సురేష్ , బాలాజి,సుమన్ రావు, మహిళా కన్వీనర్ గా అనిత, సి.పి.ఎస్. కన్వీనర్ గా వినోద్, పవన్, మైనారిటీ కన్వీనర్ గా మీర్జాన్ భీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్‌లుగా యువశ్రీ మురళి, లక్ష్మయ్య, నల్లపాటి సురేష్,వెంకటేష్, గజేంద్ర కుమార్,శారదమ్మ, జగన్నాథం తదితరులు ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి చేస్తుందని తెలిపారు.

మోడీ నియంత తీరు మారాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రధాని నరేంద్ర మోడీ నియంత పోకడలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు హితవు పలికారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన, ఒప్పంద సమయాల్లో ప్రతిపక్ష నేతకు ఆహ్వానం అందక పోవడం వెనుక మోడీ నియంత ధోరణి ఉందని విమర్శించారు. రష్యాతో కాంగ్రెస్ ప్రభుత్వం నెరిపిన మైత్రి వల్లే భారత్ కు నేటి వరకు బలమైన బంధం ఏర్పడిందని తెలిపారు.

జగన్ నోరుకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఓ పార్టీకి అధినేత, మాజీ ముఖ్యమంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారుడు మాటలు మాట్లాడుతున్న జగన్ నోటికి అడ్డుకట్ట వేయాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి శనివారం విజ్ఞప్తి చేశారు. నానాటికీ విలువలు కోల్పోతున్న జగన్ ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులపై సైతం పరుష బాష వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బాష మారేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు బీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 70వ వర్ధంతిని బాలాయపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్లూరు మల్లి కార్జున్, కనుపూరు నాగయ్యలు స్థానికంగా ఏర్పాటు చేసిశ్రీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించి న కల్పించిన మహెూన్నత వ్యక్తి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు.

మహిళ మెడలో బంగారం అపహరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళ మెడలో బంగారం ఆపహరణకు గురైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంగారమ్మ గుడి వీధికి చెందిన శైలజ గత నెల 26వ తేదీన నాయుడుపేటలో నివాసం ఉంటున్న తమ్ముడి ఇంటికి వెళ్లేందుకు శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుంది. నాయుడుపేట బస్సు ఎక్కి కొంత దూరం వెళ్ళాక మెడలో నగలు మాయం కావడాన్ని గుర్తుంచి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగల విలువ సుమారు రూ.3.60 లక్షలు(30 గ్రాములు) ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఉన్న చెట్ల పొదల్లో చల్ల కాలువ నుంచి కొట్టుకొని వచ్చి చెట్లలో ఇరుక్కుని వున్న మృతదేహం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఒకటవ పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు లోపు ఉండవచ్చు. పూర్తి వివరాలు తెలియలేదు. మృతుని ఆనవాళ్లు గుర్తుపట్టిన వారు గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నంబర్లకు 9490413803, 9440796342 సమాచారం అందించాలని కోరారు.